## ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలి



నినాదాలు చేస్తున్న ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు

షాబాద్, జూన్ 9: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డిజిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఉద్యమకారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలన్నారు. ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. అమర వీరుల కుటుంబాన్ని ఆదుకోవాలని చెప్పారు. ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు జక్కని శివకుమార్, బాల్‌రాజ్, గౌసియాబేగం, వినోద, బాల్‌రాజ్, మల్లగల్ల చెన్నయ్య, మల్లేశ్, సయ్యద్ మతీన్, సయ్యద్ గౌస్‌పాషా, చెన్నయ్య, తస్లీమ్, లక్ష్మయ్య, శివ, రావుల లక్ష్మి, యాదయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



పాత జాతీయ రహదారి తారు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# జాతీయ రహదారితో షాద్‌నగర్ అభివృద్ధి

**పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్**

షాద్‌నగర్‌టౌన్, జూన్ 9: పాత జాతీయ రహదారితోనే షాద్‌నగర్ మరింత అభివృద్ధి సాధించనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పాత జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తారు రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాత జాతీయ రహదారి పనులు పూర్తయితే వాహనదారులు తమ రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తదన్నారు. షాద్‌నగర్ ముఖ్యకూడలి నుంచి 4.9కిలో మీటర్ల మేర రూ. 45కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణవేణి, శ్రీనివాస్, సర్వర్‌పాషా, నాయకులు బాబర్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, జమృత్‌ఖాన్, రాజేందర్, శ్రీశైలం, విజయ్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలి



పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం సభ్యులతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కడ్తాల్, జూన్ 9: అమెరికాలో స్థిరపడ్డ పాలమూరువాసులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. అమెరికాలోని జార్జియా, అట్లాంటా నగరం వేదికగా నిర్వహిస్తున్న ఆటా మహాసభలు-2024 వేడుకల్లో రెండవ రోజు ప్రవాస భారతీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాలకు సంబంధించిన పలు అంశాలను సమావేశంలో చర్చించినట్టు ఆయన తెలిపారు. పాలమూరు జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల) సమిష్టిగా ముందుకెళ్లి, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా నిధులు తీసువచ్చి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టంతోపాటు, సంక్షేమ కార్యక్రమాలకు తమ వంతు సహకారమందిస్తామని పాలమూరు ఎన్ఆర్ఐలు వెల్లడించారన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్‌రెడ్డి, భరత్, నర్సింహారెడ్డి, సాయి, సుభాశ్, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు, తల్లిదండ్రులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 9 : విద్యార్థులు ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ భాస్కర్ గౌడ్ అన్నారు. ఉచితంగా చిన్నారులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడల్లో రాణించిన చిన్నారులకు పతకాలు అందజేసి మాట్లాడారు. ఈ శిబిరానికి పోలోజు అరుణ్‌చారి స్పాన్సర్‌గా వ్యవహరించారు. 39 రోజులుగా శిబిరాన్ని నిర్వహించిన ప్రశాంత్‌చారిని అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు డి. శంకర్‌గౌడ్, ఎస్.లింగంగౌడ్, నిర్వాహకులు పోలోజు ప్రశాంత్‌చారి, ఎం రోహన్‌గౌడ్, హరికృష్ణ, ఎం శంకర్, ఎంజీ శివ, సీనియర్ క్రీడాకారులు మధు, రాజేశ్, బ్రహ్మచారి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



ఇబ్రహీంపట్నం, జూన్ 9 : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీలు, పదోన్నతులు రంగారెడ్డిజిలాల ఉపాధ్యాయులకు లేకపోవటం అన్యాయమని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్టీయూ భవన్‌లో సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతుల విషయంలో రంగారెడ్డిజిల్లాను చేర్చకపోవటం సరైంది కాదన్నారు. వెంటనే చేర్చి జిల్లాలోని ఉపాధ్యాయలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఏవీ సుధాకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రావు, పరమేస్, భాస్కర్, రాజమల్లయ్య, జగన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

# దివ్యాంగుల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

**వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత**

యాచారం, జూన్ 9 : దివ్యాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. మండల కేంద్రంలోని విద్యాంగుల కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.4,000 నుంచి రూ.6,000లకు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం సిగ్గు చేటన్నారు. దివ్యాంగులపై సీఎంకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పింఛన్‌ను రూ.6,000లకు పెంచి, సకాలంలో సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఒకే నెలలో రెండుమార్లు ఇచ్చిన పింఛన్ జూన్9 తారీఖు దాటినా పింఛన్ ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నాడే పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల మాదిరిగానే దివ్యాంగులకు అన్ని రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగులకు బ్యాంకుల ద్వారా తగిన రుణాలు అందించి స్వయం ఉపాధి పొందేలా చూడాలన్నారు. హామీలను నెరవేర్చకుంటే వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు బాలరాజు, మండల అధ్యక్షుడు మహ్మద్ సలీం, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మూలి మహేశ్, నాయకులు జోగు అంజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత సూర్యవంశీ

## రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

యాచారం, జూన్9: ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సదస్సుకు రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి చట్టాన్ని రక్షించుకునేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# సజావుగా గ్రూప్-1 పరీక్ష

**హాజరైన 12295మంది అభ్యర్థులు**

ఇబ్రహీంపట్నం, జూన్ 9 : తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్ -1 పరీక్షకు ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 25 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఈ పరీక్ష జరిగింది. డివిజన్‌లో 25 పరీక్షా కేంద్రాలకు గానూ 15912మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా, 12295మంది హాజరయ్యారు. 3617మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 144సెక్షన్ అమలులో ఉంచారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని సెంటర్‌లో 3నిమిషాలు ఆలస్యగా వచ్చిన ఓ యువతిని లోపలికి అనుమతించలేదు. దీంతో యువతి కంటతడి పెట్టారు.



రోదిస్తున్న యువతి



పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావటంతో అనుమతించని పోలీసులు



### కమ్మలు తీయించి.. కేంద్రంలోకి పంపించి

పెద్దఅంబర్‌పేట, జూన్ 9: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీ, తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీతోపాటు పలు కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-1 పరీక్షలు సజావుగా జరిగాయి. కేంద్రాల వద్ద అభ్యర్థులను ముందుగానే తనిఖీ చేసి లోపలికి పంపించారు. బంగారు ఆభరణాలను తీయించారు. పలువురు మహిళా అభ్యర్థులు చెవి కమ్మలు, గాజులను తీసి సంబంధీకులకు అందజేసి పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లారు.



పరీక్ష కేంద్రం బయటే చెవి రింగులు తీస్తున్న యువతి


## ఎస్ఐ విఠల్‌రెడ్డికి ఉత్తమ సేవా పతకం



కమిషనర్ అవినాష్ మహంతి నుంచి ఉత్తమ సేవా పతకం అందుకుంటున్న చేవెళ్ల ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి

చేవెళ్లటౌన్, జూన్ 9: చేవెళ్ల ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి నుంచి విఠల్‌రెడ్డి ఉత్తమ సేవా పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఆయనను కమిషనర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ ఎస్ఐ విఠల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు.

## ప్రేమ వివాహంతో ఒక్కటైన దివ్యాంగులు



ప్రేమ వివాహం చేసుకున్న దివ్యాంగులు


యాచారం, జూన్9: ప్రేమ వివాహంతో దివ్యాంగుల జంట ఒక్కటైంది. వివాహం అనంతరం ప్రేమ జంట ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన జాల మల్లేశ్, మంచాల మండల కేంద్రానికి చెందిన ములుగు మంగ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు దివ్యాంగులు కాగా, ప్రేమ వివాహం చేసుకొని మేడిపల్లిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులను ఆశ్రయించారు. ప్రేమ వివాహం చేసుకున్నామని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, మాజీ సర్పంచ్‌లు పాచ్చభాష, శ్రీనివాస్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ప్రేమ జంటను ఆశీర్వదించారు. పోలీసులతో మాట్లాడి వారికి రక్షణ ఇవ్వాలని కోరారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



కడ్తాల్ (తలకొండపల్లి), జూన్ 9: ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు రావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన నాయీ బ్రాహ్మణులకు, శంకర్ సహకారంతో దాతలు పులిమాంటి సీతారాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కమలాకర్ రూ.85వేల విలువ చేసే వాయిద్యాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామాచారి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, జంగయ్య, రమేశ్, బాలకృష్ణయ్య, వేణు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వం ఆత్మీయ సమ్మేళనం



యాచారంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యాచారం, జూన్9 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కన్నుల పండువగా జరిగింది. యాచారం, మొగుళ్లవంపు, గాండ్లగూడ, నక్కగుట్టతండాకు చెందిన 86మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా 23 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ విద్యా సంవత్సరం తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆట, పాటలతో ఎంతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరం ఎంఈవో కృష్ణ, హెచ్ఎంలు కృష్ణయ్య, నారాయణరెడ్డి, సత్యం, రమేశ్, చంద్రమౌళి, వెంకటలక్ష్మి, పద్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1994-1995బ్యాచ్ పదోతరగతి పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని వెంకట నర్సింహ గార్డెన్‌లో నిర్వహించారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత చిన్ననాటి మిత్రులు కలుసుకొని తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. వారు స్థాపించిన స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ మిత్రుల పిల్లలు పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన వారికి జ్ఞాపికలను అందజేశారు. వారి మిత్రుడైన శిరందాస్ జగదీశ్వర్ 42 సార్లు రక్తదానం చేయడంతో ఆయనను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, స్నేహహస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, స్నేహహస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు తల్లోజు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పెరికేటి యాదయ్య, ఉప అధ్యక్షుడు శ్రీను, కోశాధికారి యాదయ్య, ఉన్న వెంకటేశ్, శిరందాస్ జగదీశ్వర్, జహంగీర్, ఆనంద్, ఆనంద్, భిక్షపతి, భయ్య దేవేందర్ పాల్గొన్నారు.

**కడ్తాల్ (తలకొండపల్లి) :** మండల పరిధిలోని చంద్రధన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆటపాటలు, క్విజ్ పోటీలు, డ్యాన్స్‌లతో సరదాగా గడిపారు. తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో రజిత, సరిత, ప్రసన్న, శ్రీలత, సాయిబాబా, శివశంకర్, శేఖర్, మహేందర్, చెన్నయ్య, గీత పాల్గొన్నారు.



ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో..



కడ్తాల్‌లో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## అంతారం మాజీ సర్పంచ్ మృతి



విఠలయ్యగౌడ్ (ఫైల్)

చేవెళ్ల రూరల్, జూన్ 9 : చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విఠలయ్య గౌడ్ (60) అనారోగ్య సమస్యలతో దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. విఠలయ్య గౌడ్ అంతారం గ్రామానికి 3 సార్లు సర్పంచ్‌గా సేవలందించారు. ప్రజలు భారీగా వచ్చి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

## జేఈఈ ఫలితాల్లో కడ్తాల్ విద్యార్థికి ర్యాంక్



కడ్తాల్, జూన్ 9: ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన గిరిజన విద్యార్థి సభావట్ లోకేశ్ 27వ ర్యాంక్ సాధించాడు. లోకేశ్ కడ్తాల్ గ్రామంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి 9.8 జీపీఏ, ఇంటర్మీడియట్ నారాయణ కళాశాలలో చదివి 948 మార్కులు సాధించాడు. జేఈఈ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన లోకేశ్‌ను పలువురు అభినందించారు.

## బస్సు ఢీకొని మహిళ మృతి

నందిగామ, జూన్ 9: బస్సు ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన ఆర్టీసీబస్సు హైదరాబాద్ నుంచి కర్ణాటక వెళ్తుంది. నందిగామ బైపాస్ రోడ్డులోని ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతిరాలి వయస్సు సుమారు 35 ఏండ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. అలాగే గ్రీన్ కలర్ జాకెట్, పసుపు రంగు చీర కాళ్లకు కడియాలు ధరించి ఉందని వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.



## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలి

ఆదిబట్ల, జూన్ 9: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిబట్లలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా విద్యను బోధించినప్పుడు ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవటానికి ఆసక్తి చూపుతారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేశ్, కౌన్సిలర్ వనం శ్రీను, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, నాయకులు నల్లబోలు పాండురంగారెడ్డి, సాయబాబాగౌడ్, మాజీసర్పంచ్ భూపతిగళ్ల రాజు, నర్సింహ, వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇంటి స్థలాన్ని కేటాయించాలి

తుర్కయాంజాల్,జూన్ 9: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని వెంటనే కేటాయించాలని టీయూఎఫ్ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని టీయూఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకునే ఉద్దేశంతో 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. సమావేశంలో ప్రకాశ్, విక్రమ్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

